ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 చిత్తూరు జిల్లా వార్తలు

శుక్రవారం 12 ఏప్రిల్ 2024

పుంగనూరులో ముస్లింలకు సందేశమిస్తున్న మతగురువు | రామకుప్పంలో ఈద్గాకు వెళుతున్న ముస్లింలు | చిత్తూరులోని గిరింపేట ఈద్గాలో ముస్లింల ప్రార్థనలు





భక్తిశ్రద్ధలతో రంజాన్

కఠోర ఉపవాస దీక్షలు పూర్తిచేసిన ముస్లింలు.. భక్తిశ్రద్ధలతో గురువారం రంజాన్ పర్వదినాన్ని జరుపుకొన్నారు. ఊరేగింపుగా ఈద్గాల వద్దకు చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఖురాన్ సందేశాన్ని మతపెద్దలు వినిపించారు. మహ్మద్ ప్రవక్త బోధనలను పాటించాలని సూచించారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు ఈద్ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. ఈద్గా, మసీదుల నుంచి ఇళ్లకు తిరిగి వచ్చే సమయంలో పేదలకు దానధర్మాలు చేశారు. చిత్తూరు నగరం గిరింపేట ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సమాజంలో అన్ని మతాలు, వర్గాలు పరస్పర సహనంతో మెలిగిన నాడే నిజమైన సమానత్వం వెల్లి విరుస్తుందన్న సారాంశమే ఖురాన్ దివ్య సందేశమని జిల్లా ప్రభుత్వ ఖాజీ కమాలుల్లా జుహూరి పేర్కొన్నారు. ఇక, చిత్తూరులోని మంగసముద్రం, బైపాస్‌రోడ్, మురకంబట్టు, ఎస్టేట్ ఈద్గాల్లోనూ ముస్లింలు ప్రార్థనలు చేశారు.

- చిత్తూరు కల్చరల్

రంజాన్ ప్రార్థనల్లోనూ వైసీపీ దౌర్జన్యం

అధికార పార్టీ అభ్యర్థి విజయానందరెడ్డి ప్రచార ప్రసంగం

టీడీపీ నేతలకు మైక్ ఇవ్వకుండా ఆగడం

ముస్లింల మనోభావాలను గౌరవించి వెళ్లిపోయిన గురజాల

ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ పండుగనూ వైసీపీ నేతలు రాజకీయం చేశారు. చిత్తూరులో ఈద్గా వద్ద అధికార పార్టీ అభ్యర్థి మాట్లాడాక.. టీడీపీకి అవకాశం ఇచ్చే సమయంలో మైకు దాచి పెట్టారు. వీరి వైఖరిపై టీడీపీ నేతలు అభ్యంతరం చెప్పారు. ఈ క్రమంలో ఇరువర్గాల వారు పెద్దఎత్తున అరవడంతో ఈద్గాలో ఉద్రిక్తత నెలకొంది. ముస్లిం సోదరుల మనోభావాలను గౌరవిస్తూ టీడీపీ నేతలు బయటకు వచ్చారు. వైసీపీ నేతల తీరుపై ముస్లింలు ఆగ్రహం వ్యక్తంచేశారు.



ఖాజీ ముందే ఇరువర్గాల తోపులాట



ప్రభుత్వ ఖాజీ సందేశం ఇస్తుండటంతో పక్కగా వేచి ఉన్న టీడీపీ అభ్యర్థి గురజాల, ఇతర నేతలు



వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డితో మాట్లాడిస్తున్న మతపెద్దలు - గురజాలకూ అవకాశం ఇవ్వాలని టీడీపీ నేత అత్తుబాయ్ కోరడంతో ఇరువర్గాల వాగ్వాదం





నెక్ మైక్‌తో మాట్లాడేందుకు గురజాల ప్రయత్నం


చిత్తూరు నగరం మసీదుమిట్ట ఈద్గాలో గురువారం ఉదయం 9 గంటలకు రంజాన్ ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. 9.40 గంటలకు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ నేతలు ఈద్గా వద్దకు చేరుకున్నారు. ప్రార్థన జరిగే సమయంలో అంతరాయం కలిగించకూడదని ఓ పక్కగా నిలబడ్డారు. పది గంటలకు నేతలతో కలిసి వచ్చిన వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి.. నేరుగా ప్రార్థనలు జరిగే స్టేజీ వద్దకు చేరుకున్నారు. అప్పటికే ప్రభుత్వ ఖాజీ కమాలుల్లా జుహూరీ రంజాన్ పర్వదినం గురించి వివరిస్తున్నారు. ఆయన ప్రసంగం ముగిసిన వెంటనే పక్కనే ఉన్న విజయానంద రెడ్డికి మైక్ ఇచ్చారు. దీంతో ఆయన వైసీపీ అధికారంలోకి వచ్చాక ముస్లింలకు చేసిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. దాదాపు ఎన్నికల ప్రచారంలా ఆయన ప్రసంగం సాగింది.

దీంతో దూరంగా ఉన్న టీడీపీ నేతలంతా స్టేజీ వద్దకు చేరుకుని తమకూ మాట్లాడేందుకు మైక్ ఇవ్వాలని కోరారు. ఇంతలో వైసీపీ కార్యకర్తలు మైక్‌దాచేశారు. కనెక్షన్‌ను కట్ చేశారు. వైసీపీకి మాట్లాడేందుకు అవకాశం కల్పించినవారు తమకు ఎందుకు ఇవ్వరని టీడీపీ నేతలు గురజాల జగన్మోహన్, దొరబాబు, అత్తుభాయ్ తదితరులు ప్రభుత్వ ఖాజీని ప్రశ్నించారు. ప్రార్థనామందిరంలో రాజకీయాలు చేయడం మంచి పద్ధతి కాదని వారు ఖాజీ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. తాము రాజకీయ ఉపన్యాసాలు ఇవ్వడానికి రాలేదని, రంజాన్ శుభాకాంక్షలు తెలిపేందుకు మైక్ ఇవ్వాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మైక్ ఇచ్చేదిలేదంటూ వైసీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అరిచారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. దీంతో ఖాజీ తన నెక్ మైక్‌ను గురజాలకు ఇవ్వగా.. ఆయన మాట్లాడే ప్రయత్నం చేశారు. వెంటనే వైసీపీ శ్రేణులు మైక్‌సౌండ్ వినిపించకుండా స్విచాఫ్ చేశారు. దీంతో టీడీపీ తరఫున వచ్చిన నాయకులు ఇలా చేయడం భావ్యం కాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. పవిత్ర రంజాన్ రోజున ముస్లింల మనోభావాలను గౌరవించి తాము.. వెళ్లిపోతున్నట్లు టీడీపీ నేతలు ప్రభుత్వ ఖాజీకి చెప్పి వెనుదిరిగారు. అక్కడే వున్న రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలకు పోలీసులు సర్దిచెప్పి పంపించేశారు. వైసీపీ అభ్యర్థికి మాట్లాడేందుకు అవకాశం ఇచ్చినప్పుడు.. టీడీపీ అభ్యర్థి మాట్లాడేందుకు ఎందుకు అవకాశం ఇవ్వరని ప్రార్థనకు వచ్చిన ముస్లింలు చర్చించుకోవడం గమనార్హం. మరోవైపు వైసీపీ నేతలు, కార్యకర్తల తీరుపై ముస్లింల నుంచి ఆగ్రహం వ్యక్తమైంది. తాము ఉపవాస దీక్షలు విరమించి.. రంజాన్ ప్రార్థనలు చేసుకుంటున్న వేళ.. రాజకీయ ప్రయోజనాల కోసం అధికార పార్టీ ఇలా వ్యవహరించడం దారుణమని పలువురు పేర్కొన్నారు.

- చిత్తూరు

ఎన్నికల్లో యువతే కీలకం

● జిల్లా ఓటర్లలో వారే అధికం



వయస్సు	ఓటర్లు
18-19	33,495
20-29	2,75,446
30-39	4,06,176
40-49	3,71,653
50-59	2,36,762
60-69	1,44,152
70-79	67,831
80-89	17,268
90-99	1,881
100-109	43
మొత్తం	15,54,712

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 11: రాబోయే ఎన్నికల్లో యువ ఓటర్లు కీలకంగా మారనున్నారు. జిల్లాలో ప్రస్తుతం 16,31,387 మంది ఓటర్లు ఉండగా, వీరిలో ఎక్కువ శాతం మంది యువతే. 2019 జనవరి 11న సుమారు 14,43,042 మంది, 2023 జనవరి 5వ తేదికి 15,43,730 మంది, 2024 జనవరి 22న 15,54,712 మంది ఓటర్లు ఉండగా 10,982 మంది పెరిగారు. 18- 39 ఏళ్లలోపు వయసున్న ఓటర్లు మొత్తం 7,15,117 మంది ఉన్నారు. అంటే ఎన్నికల్లో వీరు అభ్యర్థుల గెలుపోటములను నిర్దేశించనున్నారు.

జాతర్లకూ అనుమతి తప్పనిసరి

చిత్తూరు, ఏప్రిల్ 11: ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్నందున గంగజాతరలు, ఊరేగింపులు, ఉత్సవాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ షన్మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరూ కూడా అనుమతులు లేకుండా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని ఆయన స్పష్టంచేశారు. ముందస్తు అనుమతి కోసం నిర్వాహక కమిటీలు ఎన్నికల అధికారులను సంప్రదించి అనుమతులు తీసుకోకుంటే వారిపై ఎన్నికల కోడ్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీకే బాబుకు నోటీసులు

చిత్తూరు రూరల్: చిత్తూరులో మే 14, 15 తేదీల్లో నడివీధి గంగమ్మ జాతర జరగనుంది.ఈ జాతర నిర్వహణపై శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక పొన్నియమ్మ దేవస్థానంలో సీకే బాబు విలేకరుల సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు పలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ముందస్తు అనుమతి తప్పనిసరి. దీనిపై సీకే బాబుకు నోటీసులు ఇచ్చినట్లు ఆర్డీవో చిన్నయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కాణిపాక ఆలయంలో ముగ్గురు అధికారుల సస్పెన్షన్

ఐరాల(కాణిపాకం) ఏప్రిల్ 11: కాణిపాక వరసిద్ధుడి ఆలయంలో పదవీకాలం ముగిసి ఒకటిన్నర సంవత్సరమైనా జీతం ఇచ్చిన ఘటనలో ముగ్గురు అధికారులను గురువారం సస్పెండు చేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారం దేవదాయ శాఖ కమిషనర్ దృష్టికి పోవడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఆలయంలో భజంత్రీగా పని చేస్తున్న వెంకటరత్నం 18 నెలల కిందట పదవీ విరమణ పొందాల్సి ఉంది. ఆలయ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అతడు 18 నెలల పాటు ఉద్యోగంలో కొనసాగిన విషయం తెలిసిందే. దీనిపై మీడియాలో వార్తలు రావడం.. దేవదాయశాఖ కమిషనర్‌కు కొందరు ఫిర్యాదు చేశారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న ఆయన ముగ్గురు ఆలయ అధికారులను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. పదవీ విరమణ గడువు తర్వాత కూడా జీతం తీసుకున్న వెంకటరత్నం నుంచి నగదును ఆలయానికి జమ చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

3 నుంచి పోస్టల్ బ్యాలెట్

● ఎన్నికల సిబ్బందికి ఫారం-12డి జారీ

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 11: సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ప్రక్రియ మొదలైంది. గతంలో కంటే భిన్నంగా.. ఈసారి అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వోల కార్యాలయాల్లోనే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఇందుకు ఎన్నికల అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఎన్నికల అధికారులు, సిబ్బందికి ఫారం-12డి ధ్రువీకరణ పత్రాలను జారీచేస్తున్నారు. నియామకపత్రం, పోస్టల్ బ్యాలెట్ ధ్రువీకరణ ఇస్తున్నారు. పోటీచేసే అభ్యర్థుల బ్యాలెట్ పత్రాలను ఈనెల 29వ తేదీ తర్వాత ఇవ్వనున్నారు. మే 3వ తేది నుంచి మూడురోజుల పాటు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. పీవో, ఏపీవో, ఓపీవో, పోలీసు 33 శాఖల సిబ్బందికి ఎక్కడికక్కడ ఆర్వోల కేంద్రాల్లో ఓటు హక్కు ఉపయోగించుకోవచ్చు. జిల్లా అధికారులు, ఇతర సిబ్బంది జిల్లా కేంద్రం చిత్తూరులోనే ఓటు వేయాల్సి ఉంటుంది.

ఎన్నికల విధుల్లో 12,053 మంది

పోలింగ్‌కు అన్ని కేడర్ల అధికారులు, సిబ్బంది కలిపి దాదాపు 12,053 మందిని నియమించారు. పీవోలు 2009, ఏపీవోలు 2009, ఓపీవోలు 8035 మంది, ఎన్నికల నిర్వహణ కమిటీ సిబ్బంది 570 మంది, నోడల్ ఆఫీసర్లు 16 మంది ప్రకారం ఉన్నారు. అలాగే వివిధస్థాయిలో 33 సెక్టార్ అధికారులు 215 మంది ఉన్నారు. అలాగే వివిధ స్థాయిల్లో 33 శాఖలకు చెందిన వారికి పోస్టల్ బ్యాలెట్ పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించనున్నారు.

హోం ఓటింగ్‌పై సర్వే

ఈసారి ప్రప్రథమంగా హోంఓటింగ్ ప్రక్రియను అమల్లోకి తెస్తున్నారు. 80 ఏళ్ల వయస్సు పైబడిన వయోవృద్ధులు, 40శాతంపైన వికలత్వం కలిగిన వారికి హోం ఓటింగ్ అవకాశాన్ని కల్పించారు. మరోసారి బీఎల్వోల ద్వారా సర్వేచేయించి కచ్చిత వివరాలు రాబట్టారు. అలాంటి ఓటర్లు 42,059 మంది ఉన్నారు. వారిలో వయోవృద్ధులు 19,197 మంది, దివ్యాంగులు 22,862 మంది ఉన్నారు. ఏయే నియోజకవర్గాల్లో ఎక్కడెక్కడ హోంఓటర్లు ఉన్నారనే విషయాన్ని క్షేత్రస్థాయిలో గుర్తిస్తున్నారు. వారికి తగిన ఆప్షన్ దరఖాస్తులను ఇస్తున్నారు. బీఎల్వోలు, సూపర్‌వైజర్లు ఇంటింటికి తిరిగి ఫారాలను అందిస్తున్నారు.

సమాజానికి సేవచేసే నాయకులను ఎన్నుకోండి

● పూలే జయంతి కార్యక్రమంలో యువతకు కలెక్టరు సూచన



పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు, ఏప్రిల్ 11: కులం, మతం, పార్టీలు చూడకుండా.. ప్రలోభాలకు లొంగకుండా.. సమాజానికి సేవ చేసే నాయకులను ఎన్నుకోవాలని ఈసారి ఎన్నికల్లో తొలిసారిగా ఓటు వేయనున్న యువతకు కలెక్టరు షన్మోహన్ సూచించారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా గురువారం చిత్తూరులోని పీసీఆర్ సర్కిల్‌లో ఉన్న ఆయన విగ్రహానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల బాలికలకు చదువు ఆవశ్యకతను గుర్తించిన గొప్ప వ్యక్తి పూలే అని గుర్తుచేశారు. 21 ఏళ్ల వయసులోనే అట్టడుగు వర్గాల బాలికల కోసం తొలిసారిగా బాలికల పాఠశాలను ఏర్పాటు చేశారన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలో బీసీలకు కూడా సమాన హక్కులు కల్పించిన నాయకుడు పూలే అన్నారు. యువత బాగా ఆలోచించి ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. గతంలో చిత్తూరు మున్సిపాలిటీలో తక్కువ ఓటు శాతం నమోదయ్యేదని, ఈ సారి 90శాతం నమోదయ్యేలా అధికారులు కృషి చేయాలన్నారు. అంతకు ముందు పూలే విగ్రహానికి బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, సాంఘిక సంక్షేమశాఖ డీడీ రాజ్యలక్ష్మి తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మళ్లీ 40 డిగ్రీలు దాటిన ఎండ



నిర్మానుష్యంగా వున్న గాంధీ సర్కిల్ బస్టాప్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 11: జిల్లాలో మళ్లీ ఎండ కాస్త పెరిగింది. గురువారం రెండు మండలాల్లో 40కిపైగా డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవారం అత్యధికంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన విషయం తెలిసిందే. ఉరువారం నాటికి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నింద్రలో 40.5, తవణంపల్లెలో 40.0 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి. మండలాల వారీగా.. నగరిలో 39.2, విజయపురంలో 39.2, శ్రీరంగరాజపురంలో 39.0, బంగారుపాళ్యంలో 38.9, పులిచెర్లలో 38.7, గుడుపల్లెలో 38.5, పుంగనూరులో 38.3, కుప్పంలో 38.3, పెద్దపంజాణిలో 38.2, సోమలలో 38.2, వెదురుకుప్పంలో 38.2, సదుంలో 38.0, చౌడేపల్లిలో 37.7, రొంపిచెర్లలో 37.7, పాలసముద్రంలో 37.6, గుడిపాలలో 37.5, చిత్తూరులో 37.4, గంగవరంలో 37.4, కార్వేటినగరంలో 37.3, శాంతిపురంలో 37.3, గంగాధరనెల్లూరులో 37.0, పలమనేరులో 36.8, పెనుమూరులో 36.8, యాదమరిలో 36.7, వి.కోటలో 36.4, ఐరాలలో 35.9, పూతలపట్టులో 35.8, బైరెడ్డిపల్లెలో 35.7, రామకుప్పంలో 35.5 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వరసిద్ధుడి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



సుప్రీంకోర్టు న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 11: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని గురువారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీటీ రవికుమార్, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అశోక్.ఎస్ కినాగి ఉన్నారు. వీరు స్వామిని విడివిడిగా దర్శించుకున్నారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వారిని వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఇన్‌చార్జి డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, ఆలయ సూపరింటెండెంట్ వాసు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుకుంది మేమే..

అయినా పూర్తి వివరాలు తెలియదు

కోడి పందేల వ్యవహారంపై పోలీసుల మాట



పట్టుబడ్డ వారిని మీడియాకు చూపుతున్న సీఐ, సిబ్బంది

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 11: 'కోడిపందేల స్థావరంపై దాడిచేసి పట్టుకుంది మేమే. అయితే వారి వివరాలు మాత్రం మాకు ఇంకా తెలియదు' అని పోలీసులు చెప్పుకొచ్చారు. గంగాధరనెల్లూరు మండలం పాపిరెడ్డిపల్లె గ్రామానికి సమీపంలో గురువారం కొంతమంది వ్యక్తులు కోడి పందేలు ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు సీఐ శంకర్ తన సిబ్బందితో కలిసి కోడి పందేల స్థావరంపై దాడిచేశారు. అక్కడ డబ్బు, కోడిపుంజులు, ద్విచక్ర వాహనాలు, పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకుని ఫొటో దిగారు. వీరందరినీ సాయంత్రం 5.30 గంటలకు తీసుకువచ్చారు. ఈ కేసు విషయంపై గురువారం రాత్రి 9.12 గంటలకు సీఐ శంకర్‌కు ఫోన్‌చేసి వివరాలు అడగ్గా.. ఏడు పందెం కోళ్లు, రూ.11వేల నగదు, 6 ద్విచక్ర వాహనాలు, 6 కోడికత్తులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తుల పేర్లు మాత్రం ఇంకా తెలియదని సీఐ పేర్కొన్నారు. సుమారు 4గంటలకు పైగా స్టేషన్‌లో పందెం రాయుళ్లను పెట్టుకున్నప్పటికీ వారి గురించి వివరాలు తెలియదని చెప్పడం గమనార్హం.

శిలాఫలకంపై ఫొటోలు, రాతల తొలగింపు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కుప్పం, ఏప్రిల్ 11: కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ కనమపచ్చార్లపల్లెలో జగనన్న కాలనీ పేరుతో వేసిన శిలాఫలకంపై ఉన్న రాతలు, ఫొటోలను రెవెన్యూ అధికారులు గురువారం తొలగించారు. ఈ శిలాఫలకంపై సీఎం ఫొటోతోపాటు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ భరత్‌ల ఫొటోలు ఉండేవి. దీనిపై 'అధికారులకు కనబడలేదా?' అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతి పత్రికలో గురువారం వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి శిలాఫలకంపై ఉన్న ఫొటోలతోపాటు రాతలను కూడా తొలగించారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై వైసీపీ శ్రేణుల దాడి



తనపై దాడికి ఉపయోగించిన రోకలిబండను చూపుతున్న బేబి షాలిని

తొట్టంబేడు, ఏప్రిల్ 11: అంగన్‌వాడీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్తలు దాడిచేసిన సంఘటన శ్రీకాళహస్తి మండలంలోని ఎంపేడు గ్రామం ఈశ్వరయ్య కాలనీలో గురువారం చోటుచేసుకుంది. బాధితురాలు బేబి షాలిని, ఆమె సోదరి విజయమ్మ కథనం మేరకు.... ఏర్పేడు మండలం చింతలపాళెం గ్రామం మరాఠీపురం నక్కలకాలనీలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న బేబి షాలిని ఈశ్వరయ్య కాలనీలో వుంటున్న తల్లిదండ్రుల వద్ద కుమారుడితో ఉంటోంది.వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీలకు చేసిన అన్యాయంపై అప్పుడప్పుడూ బంధువులతో మాట్లాడేది.దీంతో ఆమెను టీడీపీ సానుభూతిపరురాలిగా భావించిన వైసీపీ కార్యకర్తలు శత్రుభావంతో వుండేవారు. గురువారం బేబి షాలిని ఒంటరిగా ఇంటి వద్ద వుండడం గమనించి డబ్బారాధిక, రానా నవిత, డబ్బా చరణ్, కొండి, సారయ్య తదితరులు 20మందికి పైగా విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచారు.ప్రస్తుతం బేబి షాలిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.ఈ విషయమై శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌ని అడగ్గా వారంతా బంధువులేనన్నారు. దాడిలో ఇరువర్గాలకూ గాయాలైనట్లు పేర్కొన్నారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీఈవో గారూ...

ఫిర్యాదులపై చర్యలేవీ?

నేడు తిరుపతిలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి పర్యటన



తిరుచానూరు పద్మావతీ దేవి దర్శనానంతరం ఆలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా దంపతులు

తిరుపతి, ఆంధ్రజ్యోతి: తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో వెలుగు చూసిన అక్రమాలపైన దర్యాప్తు నత్తనడకన సాగుతోంది. పాత్రధారుల్లో కొందరు సస్పెండ్ కాగా సూత్రధారులెవరన్నది దర్యాప్తు అధికారులు ఇంకా తేల్చలేదు. దీంతో అధికారులతో అక్రమాల ఆట ఆడించిన తెర వెనుక వ్యక్తులు దర్జాగా తిరుగుతున్నారు. అప్పటి ఎన్నికల్లో అక్రమాలకు అవకాశమిచ్చిన ఓటర్ల జాబితాలోని 38 వేల ఆబ్సెంట్ ఓటర్ల పేర్లు ఇంకా తొలగించనే లేదు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి నియోజకవర్గాలలో పలు అవకతవకలు, ఉల్లంఘనలు చోటు చేసుకున్నాయి. దీనిపై అసంఖ్యాకంగా ఈసీకి ఫిర్యాదులందాయి.ఈ మూడు నియోజకవర్గాల పరిధిలో పనిచేస్తున్న పలువురు అధికారులపై నేతల నుంచీ ఆరోపణలు వస్తుండగా జనంలోనూ అనుమానాలున్నాయి. రేణిగుంటలో ఇటీవల పట్టుబడిన ఎన్నికల తాయిలాలకు సంబంధించి అధికారులు దాగుడు మూతలాడుతున్నారు. టీటీడీ పాలక మండలి ఛైర్మన్ మీద, ఈవో మీద అనేక ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా ఇంతవరకూ ఎలాంటి చర్యలూ లేవు.ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం తిరుపతికి చేరుకున్న రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లపై కాసేపు అధికారులతో సమీక్షించారు.శుక్రవారం మహిళా వర్శిటీలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఆయన పరిశీలించనున్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయనున్నారు. తరువాత సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్షించనున్నారు.ఈ సందర్భంగా జిల్లాలో కొంతకాలంగా సంభవించిన ఘటనలు, తాజా పరిణామాలపై ఆయన దృష్టి సారిస్తారని రాజకీయ వర్గాలతో పాటు జిల్లా ప్రజానీకం కూడా ఆశిస్తున్నారు.

ఓటర్ల జాబితా నుంచీ తొలగని 38 వేల ఓటర్ల పేర్లు

తిరుపతి ఉప ఎన్నికల్లో స్థానికంగా నివాసం లేని 38 వేల ఓటర్లను అధికార పార్టీ నేతలు గుర్తించి వారి పేరిట అక్రమాలకు పాల్పడిన నేపథ్యంలో ఆ పేర్లను ఇంతవరకూ జాబితా నుంచీ తొలగించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈసీ ఓటర్ల జాబితాలో ఈ 38 వేల ఓటర్లనూ గుర్తించింది. ఆ వివరాలు పూర్తిగా ఈసీ వద్ద వున్నాయి. వారు వాస్తవంగా ఓటర్లా, తిరుపతిలోనే నివాసముంటున్నారా అన్నది తేల్చడం పెద్ద సమస్య కాదు. బీఎల్వో స్థాయి నుంచీ ప్రభుత్వానికి విస్తృత యంత్రాం గం వుంది. బూత్ స్థాయిలో బీఎల్వో పరిశీలిస్తే తేలిపోతుంది. అదీ కాకుంటే ఆ ఇంటి అడ్రసుతో నోటీసులు పంపితే ఓటర్లు స్వీకరించి సమాధానం ఇవ్వాలి.ఆ ప్రక్రియలోనూ వాస్తవాలు తేలుతాయి. అయితే ఈ ఓటర్ల ఆచూకీ లేదని సమాచారం. అంటే నిజంగా వారు తిరుపతి నుంచీ ఇతర ప్రాంతాలకు వెళ్ళిపోయి వుండాలి. ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు తరలిపోయి వుండాలి. అది కాదంటే అధికార పార్టీ నేతలు చేర్పించిన దొంగ ఓటర్లయినా వుండాలి. ఇందులో ఏ ఒక్కటి నిజమైనా ఆ పేర్లను జాబితా నుంచీ తొలగించాలి. ఈ విషయంలో జిల్లా యంత్రాంగం నోరు మెదపడం లేదు. ఇంత జరిగినా ఆ పేర్లు జాబితాలో కొనసాగుతుంటే ఈసీ మార్గదర్శకాలకు అర్థమే లేదు.

రేణిగుంటలో పట్టుబడిన తాయిలాలపై దాగుడుమూతలు

రేణిగుంటలో ఇటీవల నాలుగు ప్రైవేటు గోదాముల్లో రూ. కోట్ల విలువైన వైసీపీ ప్రచార సామగ్రి పట్టుబడింది. దానిపై పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. అయితే ఈ వ్యవహారం కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా మారింది. పట్టుబడిన వైసీపీ ప్రచార సామగ్రిలో చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన ఇద్దరు అధికార పార్టీ నేతల ఫొటోలు, పేర్లతో కూడిన పలు వస్తువులు లభించాయి. అవన్నీ ఓటర్లకు పంపిణీ చేయాల్సిన తాయిలాలు. పార్టీ ప్రచార సామగ్రి అంటే పార్టీ చిహ్నాలతో కూడిన జెండాలు, టోపీలు, బ్యానర్లు, స్టిక్కర్లు వుంటాయి. అంతవరకూ అభ్యంతరం లేదు. కానీ మహిళలు పెట్టుకునే బొట్టు బిళ్ళలు, చీరలు, రిస్టు వాచీలు, లౌడ్ స్పీకర్లు, వాటి స్టాండ్లు వంటివి నిస్సందేహంగా ఓటర్లకు పంపిణీ చేసేందుకు ఉద్దేశించినవే. స్పీకర్లు సాధారణంగా ఆలయాలకు, చర్చిలకు, మసీదులకు అందజేసేవి. ఇవన్నీ తాయిలాలే. నేతల ఫొటోలు, పేర్లు వాటిపై వున్నా సదరు నేతలపై కేసులు నమోదు కాలేదు. కనీసం నోటీసులు కూడా జారీ చేయలేదు. గోదాములను అద్దెకు తీసుకున్నది కూడా అధికార పార్టీ అవసరాల కోసమే. నేతలను వదిలిపెట్టి గోదాముల నిర్వాహకులపై కేసు పెట్టి చేతులు దులుపుకున్నారు.

టీటీడీ ఛైర్మన్, ఈవోల మీద ఫిర్యాదుల వెల్లువ

సార్వత్రిక ఎన్నికల వేళ టీటీడీ పాలకమండలి ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డిపై, ఈవో ధర్మారెడ్డిపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారనేది వారిపై ప్రధాన ఆరోపణ. ఛైర్మన్ కుమారుడు అభినయ్‌రెడ్డి తిరుపతిలో అధికార పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నేపథ్యంలో అతడికి అనుకూలంగా ఇటీవలి కాలంలో పలు నిర్ణయాలు తీసుకున్నారని ఇప్పటికే బీజేపీ, జనసేన, టీడీపీ నేతలు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు చేశారు. టీటీడీకి చెందిన వేలాదిమంది ఉద్యోగులు,వారి కుటుంబీకులు తిరుపతి నియోజకవర్గంలో ఓటర్లుగా వున్న సంగ తి తెలిసిందే. ఐదువేల మందికి పైగా ఉద్యోగులకు ఇళ్ళ స్థలాల కేటాయింపు, మరికొన్ని వేలమందికి వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత కల్పించడం వంటి నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే టీటీడీ నిధులతో నగరంలో రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఇవన్నీ నగర ఓటర్లను ప్రభావితం చేసేవే. కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డి తమ పదవి, ఉద్యోగాలను అడ్డం పెట్టుకుని అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడాన్ని అడ్డుకోవాలని, వారిని ఆయా స్థానాల నుంచీ తొలగించాలని ఈసీకి ఫిర్యాదులు అందుతున్నాయి. టీటీడీ ఉద్యోగులు పలువురు అధికార పార్టీ అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో బహిరంగంగా పాల్గొన్నా చర్యల్లేవు.

చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి అధికారులపైనా ఆరోపణలు, అనుమానాలు

చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల పరిధిలో కింది స్థాయి ఉద్యోగులు మొదలుకుని పై స్థాయి అధికారుల వరకూ పలువురిపై ఆరోపణలు, అనుమానాలు వున్నాయి. వారంతా అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. అధికార పార్టీ నేతల ఒత్తిడితో ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులకు అడ్డంకులు సృష్టిస్తున్నారని, వైసీపీ నేతల కోడ్ ఉల్లంఘనలను చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని వీరిపై ఫిర్యాదులు అందుతున్నాయి. ఓటర్ల జాబితాలలో తప్పులను సరిదిద్దాలని ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా బీఎల్వోల నుంచీ ఈఆర్వోల దాకా పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి.జిల్లా పర్యటనలో వున్న సీఈవో ముకేష్ కుమార్ మీనా వీటన్నింటిపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సి వుంది. లేనిపక్షంలో ఈసీ నిబంధనలకు, మార్గదర్శకాలకు అర్థమే లేకుండా పోతుందన్న అభిప్రాయం జనంలో ఏర్పడే ప్రమాదముంది.తిరుపతి లోక్‌సభ నియోజకవర్గానికి 2021లో జరిగిన ఉప ఎన్నికల్లో పలు అక్రమాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి ఓటర్ల జాబితాలో స్థానికంగా నివాసం లేని 38 వేల మంది ఓటర్లను గుర్తించి అధికార పార్టీ నేతలు కొందరు భారీ అక్రమానికి పాల్పడ్డారు. అందులో 35 వేల ఓటరు కార్డులను అక్రమంగా డౌన్‌లోడ్ చేశారు. వాటికి డూప్లికేట్ కార్డులు తయారుచేశారు. అందులో ఓటరు ఫొటోలు మార్చారు. వాటి సాయంతో దొంగ ఓట్లు భారీగా వేయించారు. ఫిర్యాదులు రావడంతో స్పందించిన ఈసీ విచారణ జరపగా నిజమని తేలింది. ఐఏఎస్ అధికారి సహా పలువురు దిగువ స్థాయి అధికారులు సస్పెండయ్యారు. క్రిమినల్ కేసు కూడా నమోదైంది. కాకపోతే ఈ అక్రమానికి అసలు కారకులెవరన్నది బహిరంగరహస్యమైనా వారిని బాధ్యులుగా గుర్తించే దిశగా దర్యాప్తు సాగలేదు. అర్థాంతరంగా ఆగిపోయింది. దీంతో బాధ్యులైన అసలు వ్యక్తులు దర్జాగా ప్రజా జీవితం గడుపుతున్నారు.

తిరుపతి ఉప ఎన్నికల అక్రమాలపై నత్తనడకన దర్యాప్తు

తిరుపతి లోక్‌సభ నియోజకవర్గానికి 2021లో జరిగిన ఉప ఎన్నికల్లో పలు అక్రమాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి ఓటర్ల జాబితాలో స్థానికంగా నివాసం లేని 38 వేల మంది ఓటర్లను గుర్తించి అధికార పార్టీ నేతలు కొందరు భారీ అక్రమానికి పాల్పడ్డారు. అందులో 35 వేల ఓటరు కార్డులను అక్రమంగా డౌన్‌లోడ్ చేశారు. వాటికి డూప్లికేట్ కార్డులు తయారుచేశారు. అందులో ఓటరు ఫొటోలు మార్చారు. వాటి సాయంతో దొంగ ఓట్లు భారీగా వేయించారు. ఫిర్యాదులు రావడంతో స్పందించిన ఈసీ విచారణ జరపగా నిజమని తేలింది. ఐఏఎస్ అధికారి సహా పలువురు దిగువ స్థాయి అధికారులు సస్పెండయ్యారు. క్రిమినల్ కేసు కూడా నమోదైంది. కాకపోతే ఈ అక్రమానికి అసలు కారకులెవరన్నది బహిరంగ రహస్యమైనా వారిని బాధ్యులుగా గుర్తించే దిశగా దర్యాప్తు సాగలేదు. అర్థాంతరంగా ఆగిపోయింది. దీంతో బాధ్యులైన అసలు వ్యక్తులు దర్జాగా ప్రజా జీవితం గడుపుతున్నారు.

రాజకీయాలను హుందాగా చేయడమే మా నైజం

వలంటీర్లకు మంచి భవిష్యత్తు అందిస్తామన్న అమర్



వీరప్పల్లెలో మాట్లాడుతున్న మాజీమంత్రి అమరనాథరెడ్డి

పెద్దపంజాణి, ఏప్రిల్ 11: రాజకీయాలను హుందాగా చేయడమే నూతనకాల్వ కుటుంబ నైజమని మాజీమంత్రి అమరనాథరెడ్డి అన్నారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా గురువారం పెద్దపంజాణి మండలం తుర్లపల్లె, వీరప్పల్లె పంచాయతీలలో ఆయన పర్యటించారు. మల్లసముద్రంలోని ముస్లింలతో కలసి రంజాన్ పండుగ జరుపుకొన్నారు. ఇంటింటికి వెళ్ళి తెలుగుదేశం హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించి పార్టీకి అండగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి హయాంనుంచి 50ఏళ్లుగా.. పంచాయతీనుంచి ఢిల్లీ వరకు రాజకీయాలు చేస్తున్నా ప్రజలకు అందుబాటులో ఉన్నామని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో వచ్చి రాజకీయాలు చేసే కుటుంబం తమది కాదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఈ ప్రభుత్వంలో ఆగిన పనులన్నీ పూర్తి చేస్తానన్నారు. వలంటీర్లకు మంచి భవిష్యత్తు అందిస్తామన్నారు. ఇప్పటికే రూ.10 వేల గౌరవ వేతనాన్ని చంద్రబాబు ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. స్వచ్ఛందంగా ప్రజా సేవ చేయాల్సిన వలంటీర్లను ఐదేళ్ల వాడుకుని, తమ స్వార్థ రాజకీయాలకు బలిచేయడం తగదన్నారు. టీడీపీ నాయకులు మురహరిరెడ్డి, సర్పంచ్ పార్వతమ్మ, ఎంపీటీసీ సుబ్రమణ్యం, స్థానిక నియకులు గోపాల్‌రాజు, సుబ్రమణ్యంరాజు, నారాయణరాజు, పురుషోత్తమరాజు, జయరామరాజు,ఆదినారాయణ, గంగప్ప, మనోహర్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పూలే స్ఫూర్తితో ముందుకు..!

- టీడీపీ పాలనలో బడుగులకు సంక్షేమ పథకాలు అమలు చేసిందన్న నేతలు





జ్యోతిరావ్ పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దగ్గుమళ్ల ప్రసాదరావు తదితరులు - జిల్లా టీడీపీ కార్యాలయంలో జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 11: 'సామాజిక అసమానతలకు, అంటరానితనానికి వ్యతిరేకంగా జ్యోతిరావు పూలే అలుపు ఎరగని పోరాటం చేశారు. ఆయన స్ఫూర్తితో టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్, అదే బాటలో ప్రస్తుత పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు బడుగు బలహీన వర్గాలకోసం అనేక సంక్షేమపథకాలు ప్రవేశపెట్టారు' అని టీడీపీ నేతలు చెప్పారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా గురువారం చిత్తూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతీరావ్ పూలే అని కొనియాడారు. టీడీపీతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని అన్నారు. అలాగే నగరంలోని పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, లోక్‌సభ పార్టీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, అసెంబ్లీ అభ్యర్థి గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్ నేతలు సురేంద్రకుమార్, కోదండయాదవ్, మోహన్‌రాజ్, కటారి హేమలత, కాజూరు బాలాజి, శ్రీదర్‌యాదవ్, కాజూరు రాజేష్, కంద, హేమాద్రి నాయుడు, తలారి రెడ్డెప్ప, శంకర్, ఈశ్వర్, తారక్, గోకుల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 65,570 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,446 మంది తలనీలాలు సమర్పించారు.

ఒంటరి ఏనుగు విధ్వంసం



ఒంటరి ఏనుగు సంచారంతో టమోటా పంట ధ్వంసం

సోమల, ఏప్రిల్ 11: మండలంలోని చిన్నఉప్పరపల్లె పంచాయతీ వినాయకపురం వద్ద ఒంటరి ఏనుగు బుధవారం రాత్రి సంచరించినట్లు గ్రామస్తులు తెలిపారు. వారం క్రితం 16 ఏనుగుల గుంపు పత్రపల్లె, కొత్తూరు, బోనమంద, అన్నెమ్మగారిపల్లె ప్రాంతాల్లో సంచరించి రైతులకు కునుకు లేకుండా చేశాయి. ఈ క్రమంలోనే గుంపులోని ఓ ఏనుగు వినాయకపురం వద్ద సంచరించినట్లు రైతులు తెలిపారు. అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నీళ్ల కోసం నిలదీత

పెనుమూరు, ఏప్రిల్ 11: నీళ్ల సమస్యపై వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మిని గురువారం గ్రామస్తులు నిలదీశారు. పెనుమూరు మండలం కంబాలచేను, పుట్టగానిపల్లి గ్రామాల్లో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. దారి సమస్యలు, తాగునీటి సమస్య ఉందని గడప గడపలో మీ నాన్నకి తెలిపామని, ఇంత వరకు పరిష్కరించలేదంటూ ఆమెను నిలదీశారు.

తిరుమలలో గీతాంజలి



అచ్చ తెలుగు హీరోయిన్ అంజలి తాను నటించిన 'గీతాంజలి మళ్లీ వచ్చింది' చిత్రం విడుదల సందర్భంగా గురువారం తిరుమల వెంకన్నను దర్శించుకున్నారు.

అతివేగానికి ముగ్గురు యువకుల బలి



చైతన్య,అజయ్, జగదీష్ (ఫైల్ ఫొటోలు)

తిరుచానూరు/వరదయ్యపాళెం, ఏప్రిల్ 11: అతివేగం కారణంగా జరిగిన రెండు ప్రమాదాల్లో ముగ్గురు యువకుల నిండు ప్రాణాలు గాలిలో కలసిపోయాయి. తిరుచానూరు ఎస్ఐ జగన్నాథ రెడ్డి కథనం ప్రకారం... నెల్లూరుకు చెందిన చైతన్య(18) ఐటీఐ పూర్తి చేసి శ్రీకాళహస్తి సమీపంలోని ఓ పరిశ్రమలో అప్రెంటీస్ చేసేవాడు. తిరుచానూరు సమీపంలోని దామినేడు హౌసింగ్‌కాలనీలో గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. గురువారం వేకువజామున దామినేడుకు చెందిన అజయ్(17)తో కలిసి మోటార్ సైకిల్‌పై తిరుపతిలోని లక్ష్మీపురం సర్కిల్‌కు వెళ్లాడు.మరో స్కూటర్‌పై స్థానికంగా ఉన్న వీరి స్నేహితులు భాస్కర్, సందీప్ కూడా టీ తాగడానికి లక్ష్మీపురం సర్కిల్‌కు వచ్చారు. నలుగురూ టీ తాగాక చైతన్య, అజయ్ తిరిగి దామినేడుకు బయలుదేరారు. ఫ్లై ఓవర్ ముగిసే స్థలం వద్ద ఓ కల్యాణ మండపం గేటును వీరు ప్రయాణిస్తున్న స్కూటర్ అతివేగంగా ఢీకొంది.దీంతో ఇద్దరికీతీవ్రగాయాలయ్యాయి. వెనుకే వచ్చిన భాస్కర్, సందీప్ వెంటనే 108అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు.అంబులెన్స్ సకాలంలో రాకపోవడంతో ఆటోలో ఆస్పత్రికి తరలించారు. చైతన్య మార్గమధ్యంలోనే మృతి చెందగా అజయ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు.కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాలను రుయా మార్చురీకి తరలించారు. శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించాక శవాలను బంధువులకు అప్పగించనున్నారు. అజయ్ ఇటీవల పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్ష రాశాడు. వీరి మృతితో రెండు కుటుంబాలూ విషాదంలో మునిగిపోయాయి. కాగా వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరుకుచెందిన జగదీష్ (28) గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. శ్రీసిటీ ఎస్ఐ శ్రీకాంత్ కథనం మేరకు...చిన్నపాండూరు సమీపంలోని ఏజీఎల్ పరిశ్రమలో పనిచేస్తున్న జగదీష్ గురువారం మధ్యాహ్నం 3గంటలకు బైక్‌లో ఇంటికి వస్తుండగా రాచపాళెం మలుపు కోనాక్షమ్మ ఆలయ సమీపంలో బస్సును ఓవర్ టేక్ చేయబోయి అదుపు తప్పి కింద పడిపోయాడు. అక్కడికక్కడే జగదీష్ మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.జగదీష్ మృతి విషయం తెలిసి 8 నెలల గర్భవతి అయిన ఆయన భార్య దిగ్భ్రాంతికి గురైంది. ఎస్ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోట్లవంకలో శంఖారావం

రామకుప్పం, ఏప్రిల్ 11:మండల పరిధి మోట్లవంకలో గురువారం టీడీపీ నాయకులు శంఖారావం కార్యక్రమంలో పాల్గొని, ఇంటింటా సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో యువత భవిష్యత్తు బాగుండాలంటే ప్రతి ఒక్కరూ టీడీపీని ఆదరించాలని కోరారు. అనంతరం మోట్లవంకకు చెందిన వైసీపీ కార్యకర్తలు శ్రీరాములు, వెంకటకృష్ణప్ప, గొల్లపల్లెసురేష్‌లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో నేతలు సీజీ గంట్లప్ప, బాలు, ఉమేష్, గోపీ, వెంకీ పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



కుప్పం, ఏప్రిల్ 11: లుకేమియా వ్యాధితో బాధపడుతున్న కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న శాంతిపురం మండలానికి చెందిన ఎం.హేమాద్రికి కళాశాల వైస్‌చైర్మన్ డాక్టర్ ఎన్.సునీల్‌రాజ్ ఆర్థిక సాయం అందజేశారు. తల్లిదండ్రులు అతడికి బెంగళూరులో చికిత్స చేయిస్తున్నారు. అధిక మొత్తంలో ఖర్చు అవుతుండడంతో వారు విషయాన్ని కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులు, అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది కలిసి రూ.1.20 లక్షలు సేకరించింది. ఈ మొత్తాన్ని గురువారం చెక్కు రూపంలో హేమాద్రి తల్లిదండ్రులకు ఎన్.సునీల్‌రాజ్ అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, సీఎస్‌ఈ విభాగాధిపతి లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీవై పార్టీలో చేరిన ఉలవలదిన్నె యువత



పుంగనూరు, ఏప్రిల్11: పుంగనూరు మండలం భీమగానిపల్లె పంచాయతీ ఉలవలదిన్నెలోని యువత గురువారం బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా యువకులు విజయ్‌కుమార్, శివరాజ్, సునీల్, హరి, మహేశ్, రాజ, సురేశ్‌లు మాట్లాడుతూ బీసీవైపార్టీ అధినేత రామచంద్రయాదవ్ యువతకు ఉపాధి కల్పిస్తాడనే ఆశతో గ్రామంలో దాదాపు 30మంది పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో బీసీవై పార్టీ గెలుపు కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు.

నేడు రేగడదిన్నేపల్లెలో టీడీపీ ప్రచారం

శాంతిపురం, ఏప్రిల్ 11 : మండల పరధిలోని రేగడదిన్నేపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో టీడీపీ నేతలు ఇంటింటా ప్రచారం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, ప్రధాన కార్యదర్శి నాగరాజు తెలిపారు. నియోజకవర్గ మండల, పంచాయతీ టీడీపీ నేతలు ప్రచారంలో పాల్గొనాలని కోరారు.

కుటుంబ కలహాలతో కూలీ మృతి



పుంగనూరు రూరల్, ఏప్రిల్11: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం పుంగనూరు మండలంలో జరిగింది. భీమగానిపల్లె పంచాయతీ రాంపల్లెకు చెందిన రామయ్య కుమారుడు కుమార్(45) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. ఇంటి నిర్మాణానికి అప్పులు చేయడంతో భార్య, భర్తల మధ్య గొడవలు జరగడంతో మనస్థాపం చెంది ఇంటిలోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి ముగ్గురు పిల్లలు కలరు.

లారీని ఢీకొట్టిన బైక్ : యువకుడి మృతి

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 11: మండలంలోని సుందరరాజుపురం వద్ద పాల ట్యాంకర్‌ను ఓ యువకుడు బైక్‌పై వెళుతూ ఢీకొట్టిన ప్రమాదంలో మృతి చెందాడు. గంగాధరనెల్లూరు సీఐ శంకర్ కథనం మేరకు చిత్తూరు మండలం బంగారెడ్డిపల్లె గ్రామానికి చెందిన దండపాణి కుమారుడు ఆర్య అనే యువకుడు గురువారం ఉదయం సుమారు 5.45గంటల ప్రాంతంలో ఎలక్ట్రిక్ బైక్‌పై చిత్తూరు నగరానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో గంగాధరనెల్లూరు మండలం పెద్దకాల్వ పంచాయతీ సుందరరాజుపురం వద్ద మంచు కారణంగా రోడ్డుపక్కన ఆపిన పాల ట్యాంకర్‌ను బైక్‌పై వెళుతున్న ఆర్య ఢీకొట్టాడు. ఈప్రమాదంలో ఆర్యకు తీవ్రరక్తస్రావం జరగడంతో వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడి డాక్టర్ పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారని సీఐ పేర్కొన్నారు. ఆర్య మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

14న చిత్తూరుకు వంగవీటి రాధా

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 11: రాష్ట్ర కాపు సంఘం నేత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా ఈనెల 14న చిత్తూరుకు రానున్నారని మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్ చెప్పారు. గురువారం చిత్తూరు బలిజ సంఘం అధ్యక్షుడు ఓఎం రామదాసు అధ్యక్షతన ఏఎస్ మనోహర్ నివాసంలో ఆ సంఘం నేతలు సమావేశం నిర్వహించారు. ఏఎస్ మనోహర్ మాట్లాడుతూ ఈనెల 14వ తేది ఎస్టేట్‌లో ఉన్న ఆర్‌ఎల్ కల్యాణ మండపంలో బలిజ ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నామని చెప్పారు. వంగవీటి రాధా ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు కాజూరు బాలాజి, మోహన్‌రాజ్, కాజూరు రాజేష్, యశ్వంత్, సతీష్, కిషోర్, రామ్మూర్తి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు





కుప్పంలో పార్థనలు చేస్తున్న ముస్లింలు, పుంగనూరు ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, రొంపిచెర్ల ఈద్గా వద్ద చల్లాబాబుతో ముస్లింలు

కుప్పం, ఏప్రిల్ 11: కుప్పంలో ముస్లింలు గురువారం రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధల మధ్య జరుపుకొన్నారు. ఉదయమే ఈద్గాలు, మసీదులకు చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు అల్లా తత్వాన్ని వినిపించారు. అనంతరం ఒకరికొకరు ఈద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పేదలకు దానధర్మాలు చేశారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు ఈద్గాల వద్దకు వెళ్లి ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు.

రామకుప్పం : పట్టణంలోని జామియా, మదీనా, మక్కా మసీదుల్లో ఉదయం ముస్లింలు ప్రార్థనలు చేశారు. ముస్లింలంతా జామియా మసీదు వద్దకు వచ్చి, అక్కడి నుంచి హైస్కూల్ వెనుక ఉన్న ఈద్గాకు చేరుకున్నారు. అక్కడ సామూహిక ప్రార్థనలు నిర్వహించి, మతగురువుల బోధనలు ఆలకించారు.

కల్లూరు : మండలంలోని కల్లూరు, పులిచెర్ల, కొక్కువారిపల్లి, కొత్తపేట, మంగళంపేట, తురకపేట, ఎర్రపాపిరెడ్డిగారిపల్లి, చిట్టారెడ్డిపేట, సువారపువారిపల్లి గ్రామాల్లోని ఈద్గాలకు చేరుకున్న ముస్లింలు ప్రత్యేక పార్థనలు నిర్వహించారు.

రొంపిచెర్ల : మండలంలోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చల్లా రామచంద్రారెడ్డితో కలిసి ముస్లింలు ప్రార్థనలు చేశారు.

సదుం : సదుంలోని మదీనా, జామియా, ఇక్లాస్ మసీదుల్లో ఉదయం ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. పేదలకు తోచిన దానధర్మాలు చేశారు.

సోమల : మండలంలోని సోమల, నంజంపేట, పెద్దఉప్పరపల్లె, కందూరు, నవాబ్‌పేట, పొదలగుంటపల్లె గ్రామాల్లో ముస్లింలు రంజాన్ వేడుకలను జరుపుకొన్నారు. పేదలకు దాన ధర్మాలు చేశారు.

పలమనేరు : ఎద్దుల సంత వీధిలోని ఈద్గావద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. మతగురువులు ఖురాన్‌లోని పవిత్ర సూక్తులను వివరించారు. పలమనేరు టవర్ క్లాక్ వద్ద జ్యోతిరావు పూలే చిత్రపటానికి బీసీ ఫ్రంట్ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ ఫ్రంట్ నాయకులు గోవిందస్వామి, రవి, షన్ముగం, ఆనందగౌండర్, గిరిధరగుప్తా, సామాజిక కార్యకర్త మధుమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. పలమనేరు ఎన్జీఓ హోంవద్ద జ్యోతీరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్జీఓ సంఘం పలమనేరు తాలూకా ప్రెసిడెంట్ ఆనందబాబు, జిల్లా బీసీ ఎంప్లాయిస్ సంఘ నాయకులు లక్ష్మీపతి యాదవ్, పలమనేరు పరిరక్షణ సమితి కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

శాంతిపురం : మండల పరిధిలోని ఎంకేపురం, కేపీమిట్ట, రాళ్ళబూదుగూరు, శాంతిపురం, డుంకుమానుపల్లె తదితర గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

చౌడేపల్లె : మండలంలోని మేదరదొడ్డి, కోటూరు, దాదేపల్లె, పెద్దూరు, కాన్‌సాబ్‌మిట్ట, బిల్లేరు, లద్దిగం, చారాల గ్రామాలలో ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, పేదలకు దానధర్మాలు చేశారు.

బైరెడ్డిపల్లె : పట్టణంలోని మసీదునుంచి ఈద్గా వద్దకు వెళ్లి ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదు హజరత్ ఆధ్యాత్మిక ఉపన్యాసం ఇచ్చారు.

గుడుపల్లె : మండలంలోని గుండ్లసాగరం, బెగ్గిలపల్లె, కుప్పిగానిపల్లె, కొడతనపల్లె, మిట్టూరు గ్రామాల్లోని ముస్లింలు ఉదయం మసీదులో ఫజర్ నమాజు చేశారు. అనంతరం ఇంటికి వచ్చి షీర్‌ఖుర్మా సేవించి ఈద్గాకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పుంగనూరు : పుంగనూరులోని ముస్లింలు రాతి మసీదు వద్దకు చేరుకుని అల్లాహును ప్రార్థించారు. ర్యాలీగా ఎన్ఎస్‌పేట ఈద్గా, బసవరాజ ప్రభుత్వ బాలుర కాలేజీ, తోపుమఠం వద్ద గల ఎంఎం.మహమ్మదాలీ ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎస్ఎస్‌పేట ఈద్గా జనంతో నిండిపోగా రోడ్డుపై ప్రార్థనలు చేశారు. అలాగే మండలంలోని రాంపల్లె, కుమ్మరగుంట, ఈడిగపల్లె, పాలెంపల్లె, చదళ్ల గ్రామాలకు చెందిన ముస్లింలు ఈద్గాల వద్దకు చేరుకుని ఖురాన్ పఠనం చేశారు. అలాగే శ్మశాన వాటికలకు వెళ్లి పెద్దల సమాధుల వద్ద పూజలు నిర్వహించారు.






కల్లూరు ఈద్గాలో ప్రార్థనలు, సదుంలో ఈద్గాకు బయలుదేరుతున్న ముస్లింలు, పలమనేరు ఎద్దుల సంత వీధిలోని ఈద్గా వద్ద ప్రార్థనలు, బైరెడ్డిపల్లె ఈద్గావద్ద ముస్లింల ప్రార్థనలు

దీనజనోద్ధారకుడు జ్యోతిరావ్ పూలే




కుప్పం, శాంతిపురం టీడీపీ కార్యాలయాల్లో పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు



జ్యోతిరావ్ పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కుప్పం, ఏప్రిల్ 11: మహాత్మా జ్యోతిరావ్ పూలే దీనజనోద్ధారకుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. కుప్పం టీడీపీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ బీసీ సెల్ ఆధ్వర్యంలో జ్యోతిరావ్ పూలే జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, చంద్రబాబు పీఏ మనోహర్ మాట్లాడుతూ పూలే స్ఫూర్తిగా నేటి యువత ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు జేఎంసీ.మురళి, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, తెలుగు యువత నాయకుడు మణి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఈశ్వర్, సతీశ్ ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్ : జ్యోతిరావ్ పూలే ఆశయాలను నెరవేర్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఇందిరాసర్కిల్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే అణగారిన వర్గాలు అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ చదువుకోవాలనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకొచ్చిన మహానుభావుడని కొనియాడారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు సుమిత్రరమణ, జెవి.నాగరాజ, న్యాయవాది శ్రీనివాసులు, కమ్మిరెడ్డి, తోట శ్రీనివాసులు, నరసింహులు, రమణ. సజ్జాద్, చిన్నరాయుడు, వేణు తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పం : బీసీ జనోద్ధారకుడు జ్యోతిరావ్‌పూలే జయంతిని రామకుప్పం టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పూలే ఆశయాలకనుగుణంగా టీడీపీ బీసీ సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆనందరెడ్డి, నరసింహులు, పట్రనారాయణాచారి, వేలు, విశ్వనాథ్, వెంకటాచలం, వెంకటరమణ, టీపీరవి, సుబ్రీ, సతీష్, మంజునాథ్, అమరనాథ్, శంకర్, నారాయణస్వామి, బ్రహ్మానందం, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల : మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పూలే చిత్రపటాన్ని ఉంచి పూజలు చేసి నివాళులు అర్పించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకుడు బంగారు నారాయణ స్వామి, నాయకులు వెంకటేశ్, సుధాకర్, ఓబులేసు, రామాంజేయులు, దివాకర్, ధనుంజయ, రఘునాథ్ పాల్గొన్నారు.

సోమల : సోమల బస్టాండ్‌లో జ్యోతిరావ్ పూలే జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ , ప్రైవేటు వైద్యశాలల్లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

పలమనేరు : పలమనేరు టవర్ క్లాక్ వద్ద జ్యోతిరావు పూలే చిత్రపటానికి బీసీ ఫ్రంట్ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ ఫ్రంట్ నాయకులు గోవిందస్వామి, రవి, షన్ముగం, ఆనందగౌడ్, గిరిధరగుప్తా, సామాజిక కార్యకర్త మధుమోహన్‌రావు పాల్గొన్నారు. ఎన్జీఓ హోంవద్ద పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్జీఓ సంఘం పలమనేరు తాలూకా ప్రెసిడెంట్ ఆనందబాబు, బీసీ సంఘ నాయకులు లక్ష్మీపతి యాదవ్, పలమనేరు పరిరక్షణ సమితి కార్యదర్శి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

శాంతిపురం : టీడీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నేతలు విశ్వనాథనాయుడు, ఉదయకుమార్, విజయరామిరెడ్డి, మణి, నాగరాజు పాల్గొన్నారు.

చౌడేపల్లె : స్థానిక బస్టాండులో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హరిప్రసాద్, శేఖర్, కృష్ణమూర్తి, వాసు, కేశవలు తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవిదేవికి సూర్య కిరణాభిషేకం



చౌడేపల్లె, ఏప్రిల్ 11: పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవి పాదాలను సూర్యకిరణాలు తాకాయి. గురువారం ఉదయం అమ్మవారికి ఆలయ నిర్వాహకులు పంచామృతాభిషేకాలు నిర్వహించి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించగా, సూర్యకిరణాలు అమ్మవారి పాదాలపై పడి అమ్మవారికి సూర్య కిరణాభిషేకం చేశాయి.

సింహ వాహనంపై అగ్ని మారెమ్మ విహారం



గుడుపల్లె, ఏప్రిల్ 11: గుండ్లసాగరంలోని అగ్నిమారెమ్మ సింహ వాహనంపై గురువారం ఊరేగి భక్తులకు కనువిందు చేశారు. ఉదయం అమ్మవారికి వేద పండితులు అభిషేకాలు, విశేష పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టువస్త్రాలు, ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి సింహ వాహనంపై ఆశీనుల్ని చేసి మంగళ వాయిద్యాలు, కోలాలాలు, చెక్కభజనల నడుమ ఊరేగించారు. మహిళలు అమ్మవారికి కర్పూర హారతులు పట్టి మొక్కుకున్నారు.

సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన

రామకుప్పం, ఏప్రిల్ 11: ఆరిమానిపెంటలో గురువారం టీడీపీ నాయకులు సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటా అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ టీడీపీని ఆదరించి, ఘనవిజయాన్ని అందించాలని వారు కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజారిటీ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆ పార్టీ ఎస్టీసెల్ కుప్పం నియోజకవర్గ అధ్యక్షుడు కామరాజనాయక్, 89పెద్దూరు యూనిట్ ఇన్‌చార్జి గజేంద్ర, పెద్దూరు పంచాయతీ యువత అధ్యక్షుడు ప్రకాష్ కోరారు.

జ్యోతిరావ్ పూలే సేవలు చిరస్మరణీయం : అమర్




జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అమరనాథ రెడ్డి, మాజీ మంత్రిని కలిసిన ముస్లింలు

పలమనేరు, ఏప్రిల్11 : బడుగు, బలహీన వర్గాలకు మహాత్మా జ్యోతిరావ్ పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. పలమనేరులో గురువారం సామాజిక సంఘ సంస్కర్త జ్యోతిరావ్ పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి మాజీ మంత్రి అమరనాథరెడ్డి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్‌వి. బాలాజి, బీసీసెల్ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఆర్బీసీకుట్టి, గిరిబాబు, నాగరాజు, బీఆర్‌సీ కుమార్, రవి, వెంకటరమణ, భాస్కర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లా దయతో అందరూ బాగుండాలి

అల్లా దయతో అందరూ బాగుండాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఆకాంక్షించారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని గురువారం పలమనేరు టీడీపీ కార్యాలయంలో పట్టణ ముస్లింలకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముస్లింలు ఆయనను సన్మానించారు. అందరిని ఆయన ఆప్యాయంగా పలకరిస్తూ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రసంగించారు. కార్యక్రమంలో మాజీ సదర్ జాఫర్, లారీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షుడు జిలాని, నాయకులు ఖాజాపీర్, చాంద్‌బాషా, హనీఫ్, అమానుల్లా, మాబాషా, ఇంతియాజ్, అస్లాం, నదీమ్, బాబాజాన్, అబ్దుల్లా, మౌలా, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

గౌస్ బాషాకు నివాళి

పలమనేరు కాకాతోపునకు చెందిన ప్రముఖ వ్యాపారి గౌస్ బాషా మృతిపట్ల మాజీ మంత్రి అమరనాథరెడ్డి తన సంతాపాన్ని తెలియజేశారు. గౌస్‌బాషా మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఆయన వెంట మైనారిటీ నాయకులు ఖాజాపీర్, చాంద్‌బాషా, హనీఫ్, మాబాషా, నదీమ్, కుట్టి, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి రాళ్లగంగమాంబ వార్షిక ఉత్సవాలు

గుడుపల్లె,ఏప్రిల్11: గుడుపల్లె పట్టణంలోని ప్రసన్న రాళ్లగంగమాంబ ఆలయ వార్షికోత్సవాలు ఈనెల 21 నుంచి మే 3వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. 21న అంకురార్పణ, 22న కల్యాణోత్సవం, 23న రథోత్సవం, 24న అశ్వవాహనం, 25న నంది వాహనోత్సవం, 26వ తేదీన గజవాహనోత్సవం, 27న హంసవాహనోత్సవం, 28న శేష వాహనం, 29న పుష్పపల్లకి, 30న సింహవాహనం, పచ్చిగెరిగ, మే 1న ప్రాకారోత్సవం, మే2న వసంతోత్సవం, మే3న పొంగళ్లు ఉంటుందన్నారు. ప్రతి రోజు అన్నదానం ఉంటుందన్నారు. 15 రోజుల పాటు ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. భక్తులందరూ ఈ ఉత్సవాల్లో పాల్గొనాలని వారు కోరారు.

ఇందిరమ్మ రాజ్యంతో ఇంటింటా సౌభాగ్యం

రామకుప్పం, ఏప్రిల్ 11: కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో కేంద్రం, రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడితేనే ఇంటింటా సౌభాగ్యం వెల్లివిరుస్తుందని కాంగ్రెస్ పార్టీ కుప్పం నియోజకవర్గ అభ్యర్థి ఆవుల గోపి తెలిపారు. గురువారం ఆయన రామకుప్పం మండలం చెల్దిగానిపల్లెలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి మహిళకు ఏడాదికి రూ.లక్ష, రూ.2లక్షల రైతు రుణమాఫీ, రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్ళు, 2.25 లక్షల ఉద్యోగాలు, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య వంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పార్టీ రామకుప్పం, కుప్పం మండలాల అధ్యక్షుడు చంద్రప్ప, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

చల్లా బాబు విజయమే మా లక్ష్యం : టీడీపీ




చల్లావారిపల్లెలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు, గ్రామాల్లో పర్యటిస్తున్న టీడీపీ, జనసేన పార్టీ నాయకులు

రొంపిచెర్ల, ఏప్రిల్ 11: రానున్న ఎన్నికల్లో పుంగనూరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించడం తమ లక్ష్యమని నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు సహదేవ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఈశ్వరయ్య అన్నారు. గురువారం వారి ఆధ్వర్యంలో రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ చల్లావారిపల్లె హరిజనవాడకు చెందిన 20 కుటుంబాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు చల్లాబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఆయన పార్టీ కడువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పులిచెర్ల మండలం ఎర్రపాపిరెడ్డిగారిపల్లెకు చెందిన వైసీపీ నాయకులు నవీన్‌రెడ్డి, భరత్‌రెడ్డి, రాహుల్‌రెడ్డి, నిఖిల్‌రెడ్డి, వేణు తదితరులు రొంపిచెర్లలో చల్లాబాబు ఇంటి వద్ద పార్టీలో చేరారు.

కల్లూరు : చల్లా రామచంద్రారెడ్డి గెలుపే మనందరి లక్ష్యం కావాలని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు రామనాథంనాయుడు పేర్కొన్నారు. పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి, ఎల్లంకివారిపల్లి పంచాయతీల్లో గురువారం టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామనాథంనాయుడు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఇప్పటికే ప్రజలు గుర్తించారన్నారు. అందుకే ఎన్నికల ప్రచారంలో గ్రామాల్లోని ప్రజలు టీడీపీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలపై ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు కలిసికట్టుగా చల్లా రామచంద్రారెడ్డి గెలుపునకు కృషి చేయాలన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్ : తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమవుతుందని మండల టీడీపీ అధ్యక్షుడు మాధవరెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు విరూపాక్షి పేర్కొన్నారు. గురువారం మండలంలోని మోదుగులపల్లె, మిట్టచింతలవారిపల్లె పంచాయతీల్లో టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి, ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసం టీడీపీ, జనసేన నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో నిరుద్యోగులు పెరిగారని, సాగునీటి ప్రాజెక్టు నిర్మించలేదని, పరిశ్రమలు స్థాపించలేక పోయారని మండిపడ్డారు రానున్న ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ అభ్యర్థుల గెలుపునకు ప్రజలు ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శమిపతి,కృష్ణానాయక్, గంగాధర్, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, సుధాకర్, నరసింహులు, బాలాజీ, మధు, జనసేనా నాయకులు చైతన్యరాయల్, హరినాయక్, బాలాజీ నాయక్, శ్రీనివాసులు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి

చౌడేపల్లె : ఈనెల 14న మండలంలో జరగనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం టీడీపీ మండల ఉపాధ్యక్షుడు ఆవుల రామచంద్ర ఇంటి వద్ద జరిగిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఈనెల 14న చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీపతిరాజు, జంపాల శ్రీనివాసులునాయుడు, బోయకొండ సుబ్బు, సుబ్రహ్మణ్యం, బాబునాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, ప్రదీప్‌రాజు, హరి, రెడ్డి, పృథ్వీ, మంజునాథ్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

14న చిత్తూరుకు వంగవీటి రాధా రాక



సమావేశంలో పాల్గొన్న బలిజ సంఘం నేతలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 11: రాష్ట్ర కాపు సంఘం నేత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా ఈనెల 14న చిత్తూరుకు రానున్నారని మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్ చెప్పారు. గురువారం చిత్తూరు బలిజ సంఘం అధ్యక్షుడు ఓఎం రామదాసు అధ్యక్షతన ఏఎస్ మనోహర్ నివాసంలో ఆ సంఘం నేతలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ మనోహర్ మాట్లాడుతూ ఈనెల 14వ తేది ఎస్టేట్‌లో ఉన్న ఆర్ఎల్ కల్యాణ మండపంలో బలిజ ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నామని చెప్పారు. సమావేశానికి వంగవీటి రాధా ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. చిత్తూరు నియోజకవర్గంలోని బలిజలందరూ హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు కాజూరు బాలాజీ, మోహన్‌రాజ్, కాజూరు రాజేష్, యశ్వంత్, సతీష్, కిషోర్, రామ్మూర్తి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

13న పుస్తకావిష్కరణ

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 11: చిత్తూరు హరివిల్లు లలితా కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ శనివారం ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత కృష్ణదాసు రచించిన కీర్తనలు - తత్వాలు పుస్తకావిష్కరణ కార్యక్రమం జరుగుతుందని సంస్థ ప్రతినిధులు హరి నాయుడు, భాస్కర్‌రెడ్డి, మునస్వామి గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం నగరంలోని డీఐ రోడ్డులోని రాజామహల్ హోటల్‌లో నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కళాకారులు, సాహితీవేత్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

నరసింహ స్వామిగా అలరించిన కోదండ రాముడు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 11: గిరింపేట సీబీరోడ్ వీరాంజనేయస్వామి ఆలయంలో గత మూడు రోజులుగా శ్రీరామనవమి నవరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం స్వామివారికి అభిషేకం నిర్వహించి, ప్రత్యేకంగా నరసింహావతారంలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉత్సవాల నిర్వాహకులు కె.ఎస్. కుమార్, అర్చకులు కిషోర్, భక్తులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన బైక్: యువకుడి మృతి



పాల ట్యాంకర్‌ను ఢీకొట్టి తీవ్ర రక్తస్రావానికి గురైన యువకుడు ఆర్య

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 11: మండలంలోని సుందరరాజుపురం వద్ద పాల ట్యాంకర్‌ను ఓ యువకుడు బైక్‌పై వెళుతూ ఢీకొట్టిన ప్రమాదంలో మృతి చెందాడు. గంగాధరనెల్లూరు సీఐ శంకర్ కథనం మేరకు చిత్తూరు మండలం బంగారెడ్డిపల్లె గ్రామానికి చెందిన దండపాణి కుమారుడు ఆర్య అనే యువకుడు గురువారం ఉదయం సుమారు 5.45గంటల ప్రాంతంలో ఎలక్ట్రిక్ బైక్‌పై చిత్తూరు నగరానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో గంగాధరనెల్లూరు మండలం పెద్దకాల్వ పంచాయతీ సుందరరాజుపురం వద్ద మంచు కారణంగా రోడ్డుపక్కన ఆపిన పాల ట్యాంకర్‌ను బైక్‌పై వెళుతున్న ఆర్య ఢీకొట్టాడు. ఈప్రమాదంలో ఆర్యకు తీవ్రరక్తస్రావం జరగడంతో వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడి డాక్టర్ పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారని సీఐ పేర్కొన్నారు. ఆర్య మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వైసీపీ బెదిరింపులకు భయపడొద్దు



మాట్లాడుతున్న బీజేపీ, టీడీపీ నేతలు

గుడిపాల, ఏప్రిల్ 11: వైసీపీ నాయకుల బెదిరింపులకు భయపడవద్దని మండల బీజేపీ అధ్యక్షుడు ధనంజయ నాయుడు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నవారిని వైసీపీ నాయకులు ఫోన్ల ద్వారా బెదిరిస్తున్నారని, వాటికి భయపడవద్దని సూచించారు. మండలంలో గర్రాళ్ళమిట్ట, 197 రామాపురం, నారగల్లు తదితర ప్రాంతాల్లో మీరు టీడీపీకి సపోర్ట్ చేస్తే మీ పథకాలు కట్‌చేస్తామని బెదిరిస్తున్నారన్నారు. వీటన్నిటికీ ప్రజలు తగిన గుణపాఠం చెప్పేరోజులు దగ్గరపడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అరుణ్, మాజీ సర్పంచ్ ప్రతాప్ నాయుడు, టీడీపీ నాయకులు బాలసుబ్రహ్మణ్యం యాదవ్, అర్జున్, భాస్కర్ నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థులను ఆదరించండి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ దొరబాబు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 11: రాబోవు ఎన్నికల్లో టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్‌లను గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు కోరారు. గురువారం మండలంలోని 170 గొల్లపల్లిలో టీడీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం 170 గొల్లపల్లి సర్పంచ్ కోకా ప్రకాష్ నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, నాయకులు ఎన్‌పీ జయచంద్ర నాయుడు, కోదండ యాదవ్, ఎన్‌పీ విక్రమ్, ఎన్‌పీ ధరణీ నాయుడు, మహేంద్ర, జనార్దన్ గౌడ్, వాసుదేవ నాయుడు, రమణ, గీత, దీప, వెంకటేష్, రామభద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం చంద్రబాబును ఆదరించండి



సూపర్‌సిక్స్ కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నింద్ర, ఏప్రిల్ 11: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటేసి చంద్రబాబును ఆదరించాలని నింద్ర మండల టీడీపీ నాయకులు అన్నారు. గురువారం మండలంలోని ఇరుగువాయి, పాదిరి పంచాయతీల్లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్ సిక్స్ కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. అధికార వైసీపీ దళితులపై, బీసీలపై చేస్తున్న దౌర్జన్యాలను, దాడులను, అరాచకాలను వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అందించే సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు చక్రపాణి నాయుడు, జయచంద్ర నాయుడు, హరి నాయుడు, శంకర్, సతీష్ నాయుడు, బాల సుబ్రమణ్యం నాయుడు, ధనంజయులు నాయుడు, తేజేష్, స్వయరాజ్, రమేష్, బుజ్జి, ఇళయరాజా, పయణి, బాబు, సుబ్రమణ్యం, జనసేన నాయకులు శివలింగం, శేఖర్, వేలాయుధం, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవిదేవికి సూర్య కిరణాభిషేకం

చౌడేపల్లె, ఏప్రిల్ 11: పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవి పాదాలను సూర్యకిరణాలు తాకాయి. గురువారం ఉదయం అమ్మవారికి ఆలయ నిర్వహకులు పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించగా, సూర్యకిరణాలు అమ్మవారి పాదాలపై పడి సూర్య కిరణాభిషేకం చేశాయి.

దుస్థితిలో అన్నూరు ఆరోగ్య ఉపకేంద్రం



ముళ్లకంపలతో నిండి పోయిన ఆరోగ్య ఉపకేంద్రం

కార్వేటినగరం, ఏప్రిల్ 11: కార్వేటినగరం మండలం అన్నూరు. ఆరోగ్య ఉపకేంద్రం భవనం తీవ్ర దుస్థితిలో ఉంది. ఈ భవనం గురించి పట్టించుకునే వారే లేరు. ఆరోగ్య ఉపకేంద్రం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్న విషయాన్ని సైతం అక్కడ పనిచేసే వైద్య సిబ్బంది గాలికి వదిలేశారని ప్రజలు విమర్శిస్తున్నారు. వెంటనే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధ్వానంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు

- రంగులేసి హంగామా చేసిన జగన్ సర్కార్
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన వైనం



నంజరపల్లిలో నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రం

పెనుమూరు, ఏప్రిల్ 11: గత టీడీపీ ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో చేపట్టిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రస్తుత ప్రభుత్వం గాలికొదిలేసింది. టీడీపీ ప్రభుత్వంలో పంచాయతీల పరిధిలో సంపద కేంద్రాలు ఏర్పాటు చేసి స్థానిక గ్రామాల నుంచి చెత్తను సేకరించి, వాహనాల్లో తరలించి, తొట్టెల్లో వేసి వానపాములతో వర్మీ కంపోస్టు ఎరువు తయారుచేసి దాన్ని రైతులకు విక్రయించేవారు. తద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీల అభివృద్ధికి ఉపయోగించాలనేది ప్రభుత్వం ఉద్దేశం. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 1198 కేంద్రాలను నిర్మించారు. ఒక్కొక్క దానిని సుమారు రూ.7లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు చేసి నిర్మించారు. గత ప్రభుత్వంలో ఆయా కేంద్రాలు ఎంతో చక్కగా పనిచేసేవి. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం వీటిని అసలు పట్టించుకోకపోవడంతో ఈ షెడ్లు ముళ్లకంపతో నిండిపోయాయి. కొన్నిచోట్ల మందుబాబులకు నిలయంగా మారాయి. గ్రామాల నుంచి చెత్త తీసుకురావడానికి అందజేసిన వాహనాలు కూడా సచివాలయాల వద్ద ఎండకు ఎండి వానకు తడిసి తుప్పు పడుతున్నాయి.

పంచాయతీలే జీతాలు చెల్లించాలంటూ

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారడానికి జగన్ సర్కారు అవలంబించిన విధానాలే ప్రధాన కారణం. హరిత రాయబారులకు గ్రామ పంచాయతీల నుంచే జీతాలు చెల్లించాలని ప్రభుత్వం స్పష్టం చేసినందునే ఈ పరిస్థితి తలెత్తింది. పంచాయతీ ఖాతాల్లో ఉన్న నిధులను ప్రభుత్వం వెనక్కు తీసుకోవడంతో హరిత రాయబారులకు వేతనాలు ఆగిపోయాయి. కొన్ని చోట్ల తూతూమంత్రంగానే అమలవుతోంది. 2019లో వైసీపీ గెలిచి ముఖ్యమంత్రిగా జగన్ బాధ్యతలు చేపట్టిన తరువాత చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు ఆ పార్టీ రంగులు వేశారు. ఈ అంశాన్ని తప్పుపడుతూ కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో రంగులు మార్చేశారు. ఇలా ప్రజాధనాన్ని రెండు సార్లు వృథా చేశారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- ఈద్గాల్లో సామూహిక ప్రార్థనలు చేసిన ముస్లిం సోదరులు





చిత్తూరు గిరింపేట ఈద్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలనుద్దేశించి ఉపన్యసిస్తున్న ప్రభుత్వ ఖాజీ కమాలుల్లా జహారి, కార్వేటినగరంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 11: రంజాన్ పండుగ సందర్భంగా మండలంలోని వింజం పంచాయతీ ఆవలాపురం ఇందిరానగర్ కాలనీలో, వీరకనెల్లూరులో గురువారం ఉదయం మసీద్‌లో ముస్లిం సోదరులు ప్రార్థనలు చేశారు. ఈకార్యక్రమంలో ఆవలాపురం ముసిం పెద్దలు నూరస్ సాహెబ్, ఖాదర్ బాషా, హంషీర్, కరీంబాషా, వలీసాహెబ్, బాబ్జాన్, జమల్, అల్లాబక్ష్, మగ్బుల్ తదితరులు పాల్గొన్నారు.

ఐరాల: ఐరాలలో మసీదులో ముస్లింలు నమాజు చేసుకుని, పురవీధుల్లో తక్బీర్ పఠిస్తూ వీఎస్.అగ్రహారంలోని ఈద్గా వద్దకు వెళ్లారు. అక్కడ నమాజు నిర్వహించారు. అనంతరం ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుని, రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

గుడిపాల: మండలంలో 190 రామాపురం, గుర్రాలమిట్ట, కోటూరు, తుమ్మలవారిపల్లి, రాసనపల్లి, పేయనపల్లి, మండిక్రిష్ణాపురం తదితర గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జీజేఎం ఫౌండేషన్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడు, టీడీపీ నాయకులు మదుసూధన్ నాయుడు, బాబు, చిన్నబ్బ నాయుడు పాల్గొన్నారు.

కార్వేటినగరం: కార్వేటినగరంలోని మసీదులో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

బంగారుపాళ్యం: మండలంలోని ముస్లింలు గురువారం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వెదురుకుప్పం: మండలంలోని తాటిమాకులపల్లి, వేపేరి, పచ్చికాపల్లం ప్రాంతాల్లో ముస్లింలు ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఖురాన్ బోధనలు వినిపించారు.







గంగాధరనెల్లూరు మండలం ఆవలాపురంలో ముస్లింలను ఉద్దేశించి మాట్లాడుతున్న మతగురువు ఇర్షాద్ రజా, గుడిపాల మండలం గుర్రాలమిట్టలో ఇఫ్తార్ విందులో ముస్లింలు, బంగారుపాళ్యం మండలం పాలేరు వద్ద మసీదులో ముస్లింల ప్రార్థనలు

జహంగీర్ ఖాన్ కుటుంబానికి అండగా ఉంటాం

టీడీపీ సీనియర్ నేత కుటుంబానికి జీజేఎం పరామర్శ



జహంగీర్ ఖాన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గురజాల జగన్మోహన్ తదితరులు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 11: ఇటీవల మృతిచెందిన టీడీపీ సీనియర్ నేత, మాజీ వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ జహంగీర్ ఖాన్ కుటుంబాన్ని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ పరామర్శించారు. గురువారం సంతపేటలోని జహంగీర్ ఖాన్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబసభ్యులను కలసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జహంగీర్ ఖాన్ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని గురజాల హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు,నేతలు ఈశ్వర్, సీఎం విజయ, నౌషాద్, ఫైరోజ్, జాఫర్, అత్తుబాయ్, నవాజ్, అన్సర్, అబూల్, షరీఫ్, జిలాని, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

దుర్యోధన వధతో ముగిసిన మహాభారత ఉత్సవాలు



దుర్యోధనవధ నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 11: నగరంలోని 21వ డివిజన్ కుక్కలపల్లె లక్ష్మయ్యకండ్రిగ ద్రౌపది సమేత ధర్మరాజుల గుడి ఆధ్వర్యంలో గత 15 రోజులుగా నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాలు గురువారం దుర్యోధన వధ, పట్టాభిషేక మహోత్సవంతో ముగిశాయి. కార్యక్రమంలో ఉదయం ఆలయ ప్రాంగణంలో వెంకటేశ్వరా నాటక కళామండలి సభ్యులు ఏర్పాటు చేసిన సుయోధనుడి నీటి మడుగు మట్టి బొమ్మకు పూజలు చేశారు. అనంతరం దుర్యోధన, భీమసేన పాత్రధారులు ప్రదర్శించిన నాటక ప్రదర్శన అత్యంత హృద్యంగా సాగింది. అనంతరం ద్రౌపదీ సమేత ధర్మరాజుల పట్టాభిషేకం అత్యంత వైభవంగా జరిగింది. భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో ధర్మకర్త పూలసుబ్రమణ్యం నాయుడు, కుమారస్వామి నాయుడు, సిద్దయ్య నాయుడు, హరిబాబు నాయుడు, రవి నాయుడు, రామచంద్రయ్య, గోవిందయ్య, గోపాల్ అయ్యంగార్ పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడానికే అన్నదానం

గుడిపాల, ఏప్రిల్ 11: నిరుపేదల ఆకలి తీర్చడానికే అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. గురువారం గుడిపాలలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు స్వామినాథ్ గౌడ్, టీడీపీ నాయకులు జగదీశ్వర్ నాయుడు, గోవింద గౌడు, చల్లా, షణ్ముగ గౌండర్, కిట్టు, పళణి గౌండర్ పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రాగానే మహిళలకు నెలకు రూ.1500



190 రామాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ప్రతిమ

గుడిపాల, ఏప్రిల్ 11: టీడీపీ అధికారంలోకి రాగానే మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని గురజాల జగన్మోహన్ నాయుడు సతీమణి ప్రతిమ, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, గుడిపాల మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. గురువారం 190 రామాపురంలో ఇంటింటికీ వెళ్ళి ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడును, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలాజీ, ప్రభాకర్ నాయుడు, సేటు, శంకర్, దేవ, గోవింద్, వాసు నాయుడు, మాజీ సర్పంచ్ పళణి, మహిళా నేతలు ఉదయ, శిల్ప, జయలలిత తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని తరిమికొట్టండి: భానుప్రకాష్

నగరి ఏప్రిల్ 11: రాష్ట్రంలో వైసీపీని తరిమి కొట్టాలని నగరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పిలుపునిచ్చారు. నగరి పట్టణంలోని సత్రవాడలో గురువారం జరిగిన ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ప్రజలను నిలువునా ముంచిన జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికలలో ఓడించాలని పిలుపునిచ్చారు. మరమగ్గ కార్మికులకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే నిరుపేదలను ఆదుకుంటామని చెప్పారు. సైకిల్ గుర్తుకు ఓటేసి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. నగరి పట్టణ కార్యదర్శి శ్రీనివాసన్, నాయకులు మాణిక్యవాసన్, కర్ణ, పాల్గొన్నారు.



వైసీపీ నాయకులకు టీడీపీ కండువా కప్పుతున్న భానుప్రకాష్

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

నగరి పట్టణ పరిధిలోని నెత్తంకండ్రిగలో 120 మంది వైసీపీ నాయకులు గురువారం భానుప్రకాష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నాన్నలా పిలిస్తే పలుకుతానని భాను తెలిపారు. రాష్ట్రంలో టీడీపీ విజయం ఖాయమని, నగరిలో అత్యధిక మెజార్టీతో మనం గెలుస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నేత కృష్ణారెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ కరపత్రాల పంపిణీ

విజయపురం, ఏప్రిల్ 11: మండలంలోని పాతార్కాడులో గురువారం టీడీపీ నాయకులు ఇంటింటా బాబు సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం జయహో బీసీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీరాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్ రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నేతలు గుణభూషణమ్మ, బాలసుబ్రహ్మణ్యంరాజు, జనసేన జిల్లా కార్యదర్శి స్వామినాథన్, బొబ్బిలి, హరిరాజు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో కూలీ మృతి

పుంగనూరు రూరల్, ఏప్రిల్11: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం పుంగనూరు మండలంలో జరిగింది. భీమగానిపల్లె పంచాయతీ రాంపల్లెకు చెందిన రామయ్య కుమారుడు కుమార్(45) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. ఇంటి నిర్మాణానికి అప్పులు చేయడంతో భార్య, భర్తల మధ్య గొడవలు జరగడంతో మనస్థాపం చెంది ఇంటిలోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలు కలరు.

21 నుంచి రాళ్లగంగమాంబ వార్షికోత్సవాలు

గుడుపల్లె, ఏప్రిల్ 11: గుడుపల్లె పట్టణంలోని ప్రసన్న రాళ్లగంగమాంబ ఆలయ వార్షికోత్సవాలు ఈనెల 21 నుంచి మే 3వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. 21న అంకురార్పణ, 22న కల్యాణోత్సవం, 23న రథోత్సవం, 24న అశ్వవాహనం, 25న నంది వాహనోత్సవం, 26వ తేదీన గజవాహనోత్సవం, 27న హంసవాహనోత్సవం, 28న శేష వాహనం, 29న పుష్పపల్లకి, 30న సింహవాహనం, పచ్చి గెరిగ, మే 1న ప్రాకారోత్సవం, మే2న వసంతోత్సవం, మే3న పొంగళ్లు ఉంటుందన్నారు. ప్రతి రోజు అన్నదానం ఉంటుందన్నారు.

సింహ వాహనంపై అగ్ని మారెమ్మ విహారం



గుడుపల్లె, ఏప్రిల్ 11: గుండ్లసాగరంలోని అగ్ని మారెమ్మ సింహ వాహనంపై గురువారం ఊరేగి భక్తులకు కనువిందు చేశారు. ఉదయం అమ్మవారికి వేద పండితులు అభిషేకాలు, విశేష పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టువస్త్రాలు, ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి సింహ వాహనంపై ఆసీనుల్ని చేసి మంగళ వాయిద్యాలు, కోలాలాలు, చెక్కభజనల నడుమ ఊరేగించారు. మహిళలు అమ్మవారికి కర్పూర హారతులు పట్టి మొక్కుకున్నారు.

ఘనంగా జ్యోతిరావ్ పూలే జయంతి





చిత్తూరులో పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నేతలు, పూతలపట్టు టీడీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చిత్తూరు, ఏప్రిల్ 11: అంటరానితనం రూపుమాపాలని, స్త్రీ విద్య అవసరమని 18 శతాబ్దంలోనే గుర్తించి దాని కోసం తన కుటుంబంతో కలిసి కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావ్ పూలే అని పలువురు సంఘ నేతలు, రాజకీయ పార్టీలు నేతలు అన్నారు. గురువారం పీసీఆర్ సర్కిల్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి చితూరు అసెంబ్లీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడు, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, ఇతర నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే బీజేపీ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, అట్లూరి శ్రీనివాసులు, మణి నాయుడు, రామభద్ర తదితర నేతలు కూడా పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. అలాగే డీవీఎంసీ మెంబరు రాజ్‌కుమార్, దళిత సంఘ నేతలు మునస్వామి, రవి, బాబు తదితరులు నివాళులు అర్పించారు. సీపీఐ ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజన్, నేతలు దాసరి చంద్ర, మణి, రఘు తదితరులు పూలే అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ నివాళులు అర్పించారు.

చిత్తూరు (సెంట్రల్): ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపినాథ్, ముక్తార్, నాయకులు మునీర్, మధు, జగదీష్ తదితరులు పూలే విగ్రహానికి పూలమాల వేసి, ఆయన సమాజానికి చేసిన సేవలను కొనియాడారు.

పూతలపట్టు: మండలంలోని టీడీపీ కార్యాలయంలో పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల టీడీపీ కన్వీనర్ దొరబాబు చౌదరి, నాయకులు వెంకటరమణా రెడ్డి, రామానుజం, ఏకాంబరం, నేతాజి, నిత్యానందం, హరి, చిన్నబ్బ, బీసీ నాయకులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండల టీడీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పార్టీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఎన్‌పీ ధరణి, బుస్సా నాగరాజ్ గౌడ్, మహేంద్ర, నీరజాక్షులు గౌడ్, జనార్దన్ గౌడ్, ఎన్‌పీ నవీన్ చౌదరి, హేమచంద్ర నాయుడు, రాధాక్రిష్ణమ నాయుడు, సూరి నాయుడు పాల్గొన్నారు.

బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద అన్నదానం



అన్నదానం చేస్తున్న కోకా ప్రకాష్ నాయుడు తదితరులు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 11: మండలంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద గురువారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి 170 గొల్లపల్లి సర్పంచ్ కోకా ప్రకాష్ నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎన్‌పీ నవీన్ చౌదరి, లోకనాధం నాయుడు, కొండేటి శివ, గీత, వెంకటేష్, దీప, చిట్టిబాబు, బాలాజీ, చంద్రయ్య నాయుడు, హరి తదితరులు పాల్గొన్నారు.